సాక్షి
విశాఖపట్నం
గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



గృహ నిర్మాణాలు వేగవంతం

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను కలెక్టర్ మల్లికార్జున ఆదేశించారు. 8లో



ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

ఇంటర్మీడియట్ ఫైనల్ పరీక్షలకు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్ఐవో మురళీధర్ తెలిపారు. 8లో



నగర వ్యాప్తంగా నాకాబందీ 8లో

న్యూస్‌రీల్

విశాఖ టు అబుదాబి

పయనమైన ఇంగ్లండ్ క్రికెటర్లు



విశాఖ విమానాశ్రయం టెర్మినల్ లోపలికి వెళ్తున్న ఇంగ్లండ్ క్రికెటర్లు

గోపాలపట్నం: ఇంగ్లండ్ క్రికెటర్లు బుధవారం విశాఖ నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ఉదయం 7.30 గంటలకు బస్సుల్లో విమానాశ్రయానికి చేరుకున్న క్రికెటర్లు.. ప్రత్యేక విమానంలో నేరుగా అబుదాబి వెళ్లారు. వైఎస్సార్ స్టేడియంలో భారత్‌తో జరిగిన రెండో టెస్ట్‌లో ఆ జట్టు ఓటమి పాలైన సంగతి తెలిసిందే. రాజ్‌కోట్‌లో ఈ నెల 15 నుంచి మూడో టెస్ట్ ప్రారంభం కానుంది. ఈ మధ్య సమయాన్ని అబుదాబిలో గడపడానికి పర్యాటక జట్టు పయనమైంది. భారీగా తరలివచ్చిన అభిమానులు ఇంగ్లండ్ క్రికెటర్లకు వీడ్కోలు పలికారు. విమానాశ్రయంలోకి వెళ్తున్న సమయంలో వారిని తమ సెల్‌ఫోన్లలో బంధించేందుకు ఎగబడ్డారు.

ఏయూకి ఐపీ ఎక్స్‌లెన్స్ అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న డాక్టర్ పురుషోత్తం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఐపీ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. న్యూఢిల్లీలో 5వ ఐపీ ఎక్స్‌లెన్స్ అవార్డును అసోచాం అందించగా.. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి అనీష్ దయాల్ నుంచి ఏయూ ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం ఈ అవార్డును స్వీకరించారు. మేధో హక్కుల రంగంలో చేస్తున్న విశేష కృషిని గుర్తిస్తూ అసోచాం ఈ అవార్డును ప్రదానం చేసిందని డాక్టర్ పురుషోత్తం తెలిపారు. ఏయూ ఐపీఆర్ చైర్ ఆధ్వర్యంలో 125 పేటెంట్‌లు దరఖాస్తు చేశామని.. వీటిలో ఆరు పేటెంట్‌లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటిని త్వరలో వాణిజ్యీకరణ చేసే దిశగా ఆలోచన చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో డాక్టర్ పురుషోత్తంను అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

యాంపీ థియేటర్ పరిశీలన



వీసీతో చర్చిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఏయూక్యాంపస్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విశాఖ పర్యటన నేపథ్యంలో ఆంధ్రా యూనివర్సిటీలోని కె.వి.గోపాలస్వామి యాంపీ థియేటర్‌ను బుధవారం కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున పరిశీలించారు. వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, ఏడీసీపీ మణికంఠ, జీవీఎంసీ ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలసి అక్కడ పరిస్థితులను సమీక్షించారు. ఆడుదాం–ఆంధ్రా ముగింపు సందర్భంగా పీఎంపాలెంలోని క్రికెట్ స్టేడియం, ఏయూలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలో ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. థియేటర్ సామర్థ్యం, ప్రవేశం, బయటకు దారి మార్గాలు, సభ ఏర్పాటు తదితర అంశాలపై వారితో చర్చించారు. కార్యక్రమ నిర్వహణ సాధ్యాసాధ్యాలపై కలెక్టర్ సమీక్షించారు.

21 నుంచి పారాస్విమ్మింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి పారా స్విమ్మింగ్ పోటీలు ఈనెల 21 నుంచి రైల్వే అక్వా స్పోర్ట్స్‌లో జరగనున్నాయి. పారా స్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎ.మల్లికార్జున తన చాంబర్‌లో పోటీల గోడపత్రికను విడుదల చేశారు. పారా క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో చక్కటి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందాలన్నారు.

డీటీపీ కోర్సులో శిక్షణకు దరఖాస్తులు


కంచరపాలెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా కంచరపాలెం పాత ఐటీఐలో డేటా ఎంట్రీ ఆపరేటర్ షార్ట్ టర్మ్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె శ్రీకాంత్, జిల్లా నైపుణ్యాధికారి సాయి కృష్ణచైతన్య తెలిపారు. టెన్త్ ఉత్తీర్ణులై 30 ఏళ్ల లోపు గల వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 20 లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

సంక్షేమ సౌరభం.. అభివృద్ధి పథం

అన్ని వర్గాలకు సమాన కేటాయింపులతో మెప్పించిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్

ప్రజల నుంచి హర్షాతిరేకాలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలోని ప్రతి గడపకూ అభివృద్ధి ఫలాలు అందించాలన్న లక్ష్యంతో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అహర్నిశలు శ్రమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనూ అదే తీరు కనబరిచింది. సుపరిపాలన ఆంధ్ర, సామర్థ్య ఆంధ్ర, సంపన్న ఆంధ్ర, మన మహిళా మహరాణుల ఆంధ్ర, సంక్షేమ ఆంధ్ర, సంపన్న ఆంధ్ర, అన్నపూర్ణ ఆంధ్ర అంశాలు ఆధారంగా ఇంద్ర ధనస్సు లాంటి బడ్జెట్‌ని రూపకల్పన చేసి.. అన్ని వర్గాలను మెప్పించింది. ప్రతి అంశం ప్రగతి కోసం.. ప్రతి అడుగూ ప్రజల కోసం.. ప్రతి పైసా సంక్షేమం కోసం.. ప్రతి నిర్ణయం అభివృద్ధి కోసం అన్న రీతిలో రూపొందించిన పద్దు.. జనామోదం పొందింది. మహిళల ఆర్థిక, సామాజికాభివృద్ధికి పెద్దపీట వేస్తూ.. అన్నదాతలకు భరోసా కల్పిస్తూ.. పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తూ.. సంక్షేమ పథకాలతో ప్రతీ ఒక్క రంగానికి వెన్నుదన్నుగా ప్రభుత్వం ఉంటుందని ఈ బడ్జెట్‌లో స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై అన్ని వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



ద్రవ్యలోటు నియంత్రించడం అభినందనీయం



అంబేడ్కర్ ఆశయాలే మార్గదర్శకాలుగా.. బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా.. ఏ వర్గాన్నీ విస్మరించకుండా ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అద్భుతంగా ఉంది. ఆర్థిక మాంద్య పరిస్థితుల్లో ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త కీన్స్ సూచించిన ఆర్థిక విధానాలు, వినూత్న పథకాలను అమలు చేసి ఫలితాలు రాబట్టే విధంగా రాష్ట్ర బడ్జెట్ ఉంది. సంక్షేమానికి ఖర్చు చేస్తూనే ఎఫ్ఆర్‌బీఎం చట్టం(ద్రవ్య లోటు నియంత్రణ చట్టం) నిబంధనలకు లోబడి ద్రవ్య లోటును నియంత్రించడం అభినందనీయం. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, వ్యవసాయం, విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేసింది.

– ప్రొ.లజపతిరాయ్,
డా.బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ మాజీ వీసీ

మహిళలకు పెద్దపీట



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో మహిళలకు పెద్దపీట వేశారు. గర్భస్థ శిశువు నుంచి అవ్వ వరకు అందరికీ ఈ బడ్జెట్ శ్రీరామరక్షలా ఉంది. సంక్షేమం, స్వయం ఉపాధి, ఆరోగ్యం, విద్య, రక్షణ.. ఇలా అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యమిస్తూ మహారాణులుగా తీర్చిదిద్దుతున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది. ఆడబిడ్డ అంటే అవనిలో సగం, ఆకాశంలో సగం, ఆర్థికంగా సగమని తన పాలన ద్వారా సీఎం జగన్ చాటి చెప్పారు. గతంలో ఆడపిల్లగా పుట్టాలంటే భయపడేవారు. సీఎం జగన్ పాలన చూసిన తర్వాత పుడితే ఆడపిల్లగా పుట్టాలని, అది కూడా ఆంధ్రాలోనే పుట్టాలని కోరుకుంటున్నారు.

– గెడ్డం ఉమ,
మహిళా కమిషన్ సభ్యురాలు

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఇతర రాష్ట్రాలకు ఓ మార్గాన్ని సూచించే విధంగా ఉంది. ఈ బడ్జెట్‌లో సంక్షేమానికి భారీగా నిధులు కేటాయిస్తూనే అభివృద్ధికి బాటలు వేసింది. మహోన్నతుల ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన పాలనలో ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు.

– జాన్‌వెస్లీ, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్

విద్యకు ప్రాధాన్యం



ఓటాన్ అకౌంట్ బడ్జెట్ చూస్తే విద్యకి ఎంత పెద్ద పీట వేశారో అర్థమవుతుంది. ఇంగ్లిష్ మాధ్యమంలో బోధన, సీబీఎస్ఈ సిలబస్, ఐబీ సిలబస్, అధునాతన టెక్నాలజీతో కూడిన బోధన, నాడు నేడులో పాఠశాలల అభివృద్ధి ఇలా అన్ని రకాలుగా భవిష్యత్ తరాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బంగారుమయం చేస్తున్నారు. విద్యతో పాటు ఆరోగ్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు బడ్జెట్‌లో పెద్దపీట వేశారు.

– కొండా రాజీవ్,
చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా..



ఓటాన్ బడ్జెట్ కేవలం స్వల్ప కాలానికే ప్రతిపాదిస్తారు. రెగ్యులర్ బడ్జెట్‌కి దీనికి కొంత వ్యత్యాసం ఉంటుంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ ప్రధానంగా సంక్షేమం, వ్యవసాయ రంగం అభివృద్ధి లక్ష్యంగా చేసుకుని కేటాయింపులు చేశారు. బలహీన వర్గాలను దృష్టిలో ఉంచుకుని తయారు చేసిన బడ్జెట్‌గా ఇది స్పష్టమవుతోంది.

– ఆచార్య పి.విశ్వనాథం,
కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం, ఏయూ

9 నుంచి ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీలు

విశాఖ స్పోర్ట్స్: ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని.. విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పిలుపునిచ్చారు. ఆయన తన చాంబర్, ఏయూ వీసీ హాల్‌లో బుధవారం సమీక్ష సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వస్తున్న క్రీడాకారులకు వసతి, రవాణా, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో ఏ మాత్రం లోటు లేకుండా చూసుకోవాలని పోటీల నిర్వాహణ ఇన్‌చార్జిలు, లైజనింగ్ అధికారులను ఆదేశించారు. రైల్వే మైదానంలో ఈ నెల 9న ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని, అన్ని విభాగాల అధికారులు నిర్ణీత సమయానికి అక్కడ ఉండాలని స్పష్టం చేశారు. దబ్బంద, సుద్దగెడ్డ, ఏయూ వసతి గృహాల్లో క్రీడాకారులకు బస ఏర్పాటు, తాగునీరు, అల్పాహారం, భోజనం సకాలంలో అందజేయాలన్నారు. బస చేసిన చోట నుంచి క్రీడా మైదానాల వరకు ప్రత్యేక బస్సుల ద్వారా క్రీడాకారులను చేర్చడానికి ఏర్పాట్లు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. క్రీడా మైదానాల వద్ద టెంట్లు, కుర్చీలు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన లైజనింగ్ అధికారులు, క్రీడా శిక్షకులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రత్యేక ఉపకలెక్టర్లు, వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులు, లైజనింగ్ అధికారులు, రాష్ట్ర, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు చక్కని ఏర్పాట్లు



సుద్దగెడ్డ వద్ద అధికారులకు సూచనలిస్తున్న జేసీ మయూర్ అశోక్

మధురవాడ, ఆనందపురం: ఆడుదాం ఆంధ్రా పోటీలకు వివిధ జిల్లాల నుంచి విశాఖ వచ్చే క్రీడాకారులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా వసతి ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. క్రీడాకారుల వసతి కోసం కేటాయించిన మధురవాడ సుద్దగెడ్డ, దబ్బందలోని టిడ్కో ఇళ్ల సముదాయాలను బుధవారం ఆర్డీవో భాస్కరరెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నగరంలో ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు ఐదు క్రీడాంశాల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుద్దగెడ్డ వద్ద సుమారు 1,400 మంది మహిళా క్రీడాకారులకు, దబ్బందలో సుమారు 1,600 మంది పురుష క్రీడాకారులకు **వసతి ఏర్పాట్లు చేస్తున్నట్లు** వెల్లడించారు. క్రీడాకారులు నిద్రించేందుకు మ్యాట్స్ మొదలు మరుగుదొడ్లు, పరిశుభ్రత, ఆయా గదులకు గడియరాలు, లైటింగ్, భోజనం, రవాణా, భద్రత తదితర ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. ఎస్డీసీ పద్మలత, జెడ్సీలు డి.లక్ష్మి, కనక మహాలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఆర్ఐ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ముగ్గురు సీఎంలు.. భిన్న పార్శ్వాలు

'మూడు దారులు' పుస్తక పరిచయ సభలో వక్తలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్

సీతంపేట: ముగ్గురు ముఖ్యమంత్రుల పాలన చరిత్రకు 'మూడు దారులు' పుస్తకం దర్పణంగా నిలుస్తుందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్ అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్ రచించిన మూడు దారులు పుస్తక పరిచయ సభ బుధవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలను జర్నలిస్టులు ప్రభావితం చేస్తారన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాను వీసీగా విధులు నిర్వహించినప్పటి సంఘటనలు గుర్తు చేసుకున్నారు. సామాజిక విలువలు పాటిస్తూ పుస్తకం రాసిన రచయిత అమర్ అభినందనీయులన్నారు.

ఏయూ జర్నలిజం విభాగం విశ్రాంత ప్రధానాచార్యులు ప్రొఫెసర్ పి.బాబీవర్ధన్ మాట్లాడుతూ పాత్రికేయుడు అమర్ రాసిన మూడు దారులు పుస్తకంపై పీహెచ్‌డీ చేయవచ్చన్నారు. సాధారణంగా చరిత్ర, జీవిత కథలను రాస్తూ ఉంటారని, అందుకు భిన్నంగా ముగ్గురు ముఖ్యమంత్రుల పాలన చరిత్రను అమర్ రాశారన్నారు. పాత్రికేయుడు మంగు రాజగోపాల్ మాట్లాడుతూ జర్నలిస్టులు ఎప్పటికప్పుడు సమాజంలోని రాజకీయ పరిణామాలకు అప్‌డేట్ అవ్వాలని, వారిలో అమర్ ముందుంటారన్నారు. ముగ్గురు ముఖ్యమంత్రుల పరిపాలనను స్వయంగా చూసిన అమర్ ఈ పుస్తకం రాశారని తెలిపారు. రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వి.వి.రమణమూర్తి పుస్తకాన్ని సమీక్షిస్తూ చరిత్రను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత పాత్రికేయులపై ఉందని.. ఈ పుస్తకం ద్వారా అమర్ తన బాధ్యత నెరవేర్చారన్నారు. ఈ పుస్తకం ముగ్గురు ముఖ్యమంత్రులను కథా వస్తువుగా తీసుకున్నారని, నాలుగో ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కూడా దర్శనమిస్తారన్నారు. అధికారం కోసం ఆనాడు చంద్రబాబు.. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన సంఘటన పుస్తకంలో సాక్షాత్కరిస్తుందన్నారు. వైస్రాయ్ కుట్రలో వాస్తవాలను రచయిత పుస్తకంలో పొందుపర్చారని తెలిపారు. ఎన్టీఆర్ ఆత్మ ఎలా క్షోభించింది? అడ్డదారిలో చంద్రబాబు అధికారం ఎలా చేజిక్కించుకున్నారో ఈ పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఇవన్నీ ఆధారాలతో రాయడం విశేషమన్నారు.

ఆధారాలతో వాస్తవాలు ఆవిష్కరణ

పుస్తక రచయిత అమర్ మాట్లాడుతూ దక్షిణాదివారిని ఉత్తరాదివారు పట్టించుకోరని, మద్రాసీయులుగా పిలిచే తెలుగు వారిని ఆంధ్రులుగా ఎన్టీఆర్ గుర్తింపు తెచ్చారన్నారు. వైఎస్సార్, చంద్రబాబు ఒకేసారి రాజకీయాల్లోకి వచ్చారని, 1983 వరకు ఒకే పార్టీలో కలసి ప్రయాణించారన్నారు. 1983లో ఓడిపోయిన తర్వాత చంద్రబాబు టీడీపీలో చేరి.. తర్వాత కాలంలో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. 1999 ఎన్నికల్లో బీజేపీతోనూ, 2009లో టీఆర్ఎస్, వామపక్షాలతోనూ, 2014 ఎన్నికల్లో బీజేపీ, జనసేన మద్దతుతో పోటీ చేశారని, ఏనాడు ఒంటరిగా చంద్రబాబు గెలవలేదన్నారు. వైఎస్సార్ మాత్రం మొదటి నుంచి చివరి వరకు కాంగ్రెస్‌లోనే కొనసాగారన్నారు.

వీరిద్దరికీ భిన్నంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎదిగారని తెలిపారు. తండ్రి మరణం వల్ల చనిపోయిన అభిమానులను ఓదార్చడానికి కాంగ్రెస్ అధిష్టానం అడ్డుపడటం, దాంతో బయటకు వచ్చి పార్టీని స్థాపించడం, ఈడీ కేసులతో 16 నెలలు జైలుకి వెళ్లడం, వీటన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొని.. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని తెలిపారు. తాను వైఎస్సార్‌కు సన్నిహితమని గానీ, సీఎం జగన్ పాలనలో సలహాదారుడిగా పని చేశానని గానీ వారికి అనుకూలంగా, చంద్రబాబుకి వ్యతిరేకంగా ఈ పుస్తకం రాయలేదన్నారు. ఆధారాలతో వాస్తవాలు ఆవిష్కరించినట్లు చెప్పారు. ఈ పుస్తకం చదివితే అన్ని వాస్తవాలు తెలుస్తాయన్నారు. అనంతరం రచయితను ఘనంగా సత్కరించారు.



- సినిమాలోనే కాదు.. గంగారావు నిజ జీవితంలోనూ విలనే..!
- తహసీల్దార్ హత్య కేసులో నిందితుడి క్రైమ్ చిట్టా పెద్దదే..
- మూడేళ్ల క్రితం 'ది నైట్' పేరుతో సినిమా తీసిన గంగారావు
- డబ్బులు ఇవ్వకపోవడంతో సినిమా నుంచి తప్పుకున్న డైరెక్టర్
- దర్శకుడిగా అవతారమెత్తి విలన్‌గా చేసిన గంగారావు
- అందులో హీరోయిన్‌ను రాడ్‌తో కొట్టినట్టే తహసీల్దార్‌ను కొట్టి చంపిన హంతకుడు
- గతంలో రోడ్డు కాంట్రాక్టు ఇప్పిస్తానని హైదరాబాద్‌లో ఒక వ్యక్తికి రూ.1.5 కోట్లు టోకరా
- వాటర్ ప్లాంట్ పేరుతో విజయవాడలో రూ.40 లక్షలు మోసం
- తవ్వే కొద్దీ బయటపడుతున్న గంగారావు అక్రమాలపై కథనం

విశాఖ సిటీ: తహసీల్దార్ రమణయ్య హత్య కేసులో నిందితుడు మురారీ సుబ్రహ్మణ్యం గంగారావు క్రైమ్ కథా చిత్రంలో కొత్త ట్విస్టు వెలుగులోకి వచ్చింది. మూడేళ్ల క్రితం థియేటర్లలో విడుదలకు నోచుకోని ఒక సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా తీసినట్లు తేలింది. ఆ సినిమాకు గంగారావే ప్రొడ్యూసర్.. డైరెక్టర్.. విలన్ పాత్ర కూడా పోషించాడు. ఇదిలా ఉంటే.. ఆ సినిమాలో హీరోయిన్‌ను రాడ్‌తో కొట్టి చంపినట్టే అచ్చం తహసీల్దార్ రమణయ్యను కూడా కొట్టి హత్య చేయడం గమనార్హం. సినిమాలో చేసిన పాత్రను యథాతథంగా నిజజీవితంలో చేసినట్లు స్పష్టమవుతోంది. అలాగే ఇతగాడి క్రైమ్ చిట్టా చాలా పెద్దదే అన్నట్లు తెలుస్తోంది. ఒక్కో చోట ఒక్కో అవతారం ఎత్తి వ్యాపారులు, రియల్టర్లను రూ.లక్షలు, రూ.కోట్లకు ముంచేశాడు. అక్కడ కేసుల్లో చిక్కుకొని చివరకు విశాఖకు చేరుకొని ఇక్కడ కూడా అదే పంథాలో వెళ్లి చివరకు తహసీల్దార్‌ను హత్య చేశాడు.

సినిమాలో చంపినట్లే..

మురారీ సుబ్రహ్మణ్యం గంగారావు మూడేళ్ల క్రితం 'ది నైట్' అనే క్రైమ్ థ్రిల్లర్ సినిమా తీశాడు. దీనికి అతడు ప్రొడ్యూసర్‌గా వ్యవహరించాడు. ఈ సినిమాకు దర్శకత్వం వహించిన సునీల్‌కు డబ్బులు ఇవ్వకపోవడంతో అతడు ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నాడు. దీంతో గంగారావు డైరెక్టర్ అవతారమెత్తాడు. అంతేకాకుండా ఆ సినిమాలో విలన్ పాత్ర పోషించాడు. ఈ సినిమాలో ఒక సన్నివేశంలో విలన్‌గా నటించిన గంగారావు హీరోయిన్ తలపై **రాడ్డుతో కొడతాడు. అదే తరహాలో** తహసీల్దార్ **రమణయ్యను కూడా అపార్ట్‌మెంట్** సెల్లార్ తలపై **రాడ్డుతో కొట్టి చంపాడు. సినిమాలో** నటించిన **మాదిరిగానే నిజ జీవితంలో కూడా** హత్య చేయడం గమనార్హం.

క్రైమ్ చిట్టా పెద్దదే..

గంగారావు ఒక్కో ప్రాంతంలో ఒక్కో అవతారం ఎత్తి అక్కడి వారిని మోసం చేసి జిల్లాలు మారుకుంటూ విశాఖకు వచ్చాడు. హైదరాబాద్‌లో ఉన్న సమయంలో గంగారావు పెద్ద వ్యాపారవేత్తగా, ఆర్థికంగా స్థితిమంతుడిగా, అక్కడి ప్రభుత్వ పెద్దలతో సత్సంబంధాలు ఉన్నట్లు కలరింగ్ ఇచ్చేవాడు. ఈ క్రమంలో పత్తిపాటి రవి అనే వ్యక్తికి రోడ్డు కాంట్రాక్ట్ ఇప్పిస్తానని చెప్పి రూ.1.5 కోట్లకు టోకరా వేశాడు. దీనిపై రవి కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో చీటింగ్ కేసు నమోదైంది. ఆ తరువాత గంగారావు హైదరాబాద్‌లో దుకాణం సర్దేసి విజయవాడకు మకాం మార్చాడు. అక్కడ కూడా పలుకుబడి ఉన్నట్లు చెప్పుకుంటూ భవానీపురం ప్రాంతానికి చెందిన విరూపాక్ష అనే వ్యక్తిని వాటర్ ప్లాంట్ పేరుతో రూ.40 లక్షలకు మోసం చేశాడు. సదరు బాధితుడు కూడా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విజయవాడలో మరో కేసు నమోదైంది. ఆ జిల్లా నుంచి మకాం మార్చి విశాఖకు చేరుకున్నాడు. ఇక్కడ మధురవాడలో జ్యుయల్ అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా నివాసముంటున్నాడు.

పీకల్లోతు అప్పుల్లో..

మురారీ సుబ్రహ్మణ్యం గంగారావు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అతడి మోసాలు, అప్పులు, వారి వేధింపులతో విసిగిపోయిన భార్య విడాకులు ఇచ్చేసి దూరంగా వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. గంగారావుకు సుమారు రూ.4 నుంచి రూ.5 కోట్లు వరకు అప్పులు ఉన్నట్లు సమాచారం. అలాగే అతడి ఇంటిపై రుణం తీసుకొని తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకు వారు ఇంటిని స్వాధీనం చేసుకొని వేలం వేసినట్లు పోలీసులు గుర్తించారు. ఒక వైపు ప్రతి ప్రాంతంలోను ఎవరో ఒకరిని మోసం చేసి రూ.కోట్లకు టోకరా వేసిన గంగారావు అంత అప్పుల్లో కూరుకుపోవడానికి గల కారణాలు ఇప్పుడు సస్పెన్స్‌గా మారాయి.

ఇక్కడ ఎన్ఆర్ఐలతో ఒప్పందం

విశాఖకు వచ్చిన గంగారావు రియల్టర్ అవతారమెత్తాడు. ఒక ఆఫీస్ తెరిచి పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారిగా అందరినీ పరిచయం చేసుకున్నాడు. ఈ క్రమంలో ఏడుగురు ఎన్ఆర్ఐలకు సంబంధించిన కన్వేయన్స్ డీడ్స్ చేయిస్తానని నమ్మించాడు. రూ.లక్షలకు వారితో ఒప్పందం చేసుకొని అడ్వాన్స్ కూడా తీసుకున్నాడు. ఆ పని కోసమే తరచూ విశాఖ రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లేవాడు. ఈ వ్యవహారంలో కార్యాలయంలో కొంత మేర నగదు లావాదేవీలు కూడా జరిగినట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. తహసీల్దార్ కార్యాలయంలో ఎవరెవరికి ఎంత మొత్తంలో డబ్బు ఇచ్చాడన్న విషయాన్ని గంగారావు ఒక డైరీలో రాసుకున్నట్లు సమాచారం. అయితే తహసీల్దార్ ఆ పనిచేయలేదు. ఇక్కడి నుంచి విజయనగరం జిల్లా బొండపల్లికి బదిలీ అయ్యారు. ఒకవైపు ఎన్ఆర్ఐల నుంచి ఒత్తిడి ఉండడంతో గంగారావు తహసీల్దార్‌పై కోపంతో హత్య చేశాడు.

అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం



మాట్లాడుతున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన స్థాయీ సమావేశంలో 80 అజెండా అంశాలతో పాటు 61 టేబుల్ అజెండాలతో కలిపి 141 అంశాలు పొందుపరిచారు. స్థాయీ సభ్యులు వీటిని చర్చించి ఆమోదించారని మేయర్ తెలిపారు. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి పలు ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు తొలగింపునకు రూ.3.85 లక్షలు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి పలు వార్డుల్లో తాత్కాలిక పద్ధతిపై అదనపు పారిశుధ్య కార్మికుల నియామకం, కాపులుప్పాడకు వ్యర్థాలు తరలించేందుకు రూ.3.20 కోట్లు, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రూ.21.63కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యదర్శి పి.నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, కార్యనిర్వాహక ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జాయింట్ పోలీస్ కమిషనర్



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జేసీపీ

విశాఖ సిటీ: జాయింట్ పోలీస్ కమిషనర్ కె.ఫకీరప్ప జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను ఆయన ఛాంబర్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ జేసీపీగా ఆయన గత శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.

రిమాండ్ ఖైదీ అనుమానాస్పద మృతి


మృతుడు పోతన్న(ఫైల్)

ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీ మృతి చెందాడు. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జైల్ అధికారులు కార్డియక్ అరెస్టుతో మృతి చెందినట్లు వెల్లడిస్తుండగా మృతుడు బంధువుల మాత్రం జైల్‌లో తోటి ఖైదీలుగాని, సిబ్బందిగాని కొట్టి హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై బుధవారం కేజీహెచ్ మార్చురీ వద్ద మృతుడి బంధువులు ఆందోళన చేశారు. కేంద్ర కారాగారం పర్యవేక్షణాధికారి కిశోర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం బడంబీరు గ్రామానికి చెందిన కోడ పోతన్న(45) గంజాయి కేసులో నిందితుడు. ఆయనను అక్కడ పోలీసులు 2023 జూలై 27న విశాఖ జైలుకు తీసుకువచ్చారు. అప్పటి నుంచి రిమాండ్‌లో ఉన్నాడు. మంగళవారం ఉదయం ఆయనకు గుండె సంబంధ సమస్యతో ఊపిరాడకపోవడంతో జైలు వైద్యులు ప్రాథమిక చికిత్స చేశారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించడంతో కొంతసేపటికి మెరుగుపడింది. మళ్లీ కొంత సమయం తర్వాత గుండె నొప్పి రావడంతో సాయంత్రం ప్రాణాలు విడిచాడని కేజీహెచ్ వైద్యులు తెలిపినట్లు జైల్ సూపరింటెండెంట్ తెలిపారు. దీనిపై మృతుడు కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతుడికి భార్య తూలమ్మ, ఇద్దరు పిల్లలున్నారు.

పోతన్న మృతిపై విచారణ జరపాలి


ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

మహారాణిపేట : కోడా పోతన్న మృతిపై విచారణ చేయాలని బంధువులు, గిరిజన సంఘాలు, బీఎస్పీ నాయకులు బుధవారం కేజీహెచ్ మార్చురీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. పోతన్న మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, అతని కుటుంబాన్ని ఆదుకోవాలని నినాదాలు చేశారు. న్యాయం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని మాజీ ఎమ్మెల్యే, బీఎస్పీ నాయకుడు లకే రాజారావు హెచ్చరించారు. ఈ ఘటనపై మెజిస్టీరియల్ విచారణ చేయాలని బీఎస్పీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు బోని కృష్ణ కోరారు. న్యాయం చేయాలని కోరుతూ పోతన్న భార్య తూలమ్మ వన్‌టౌన్ పోలీసులు, ఆర్‌డీవోకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

గుండెపోటుతో చింపాంజీ మృతి


మృతి చెందిన చింపాంజీ(ఫైల్)

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో చీపా అనే ఆడ చింపాంజీ బుధవారం మృతి చెందింది. దీని వయసు 29 సంవత్సరాలు ఉంటుందని జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. జూ ఆస్పత్రిలో వెటర్నరీ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్డియక్ అరెస్టుతో మృతి చెందినట్లు పోస్టుమార్టం రిపోర్టు ప్రకారం వెల్లడైనట్లు ఆమె తెలిపారు. దీన్ని 2016లో ఇజ్రాయిల్ జూ పార్కు నుంచి ఇక్కడకు తీసుకొచ్చినట్లు చెప్పారు.

ఒంటరైన చికిత

ప్రస్తుతం జూ పార్కులో ఉన్న చికిత అనే పేరుగల చింపాంజీ ఒంటరైంది. ఇంతవరకు తోడుగా ఉన్న చీపా మరణించడంతో చికిత ఒక్కటే ఇక్కడ మిగిలింది. 2016లో ఇజ్రాయిల్ నుంచి చికో అనే పేరుగల ఒక మగ చింపాంజీ, చీపా, చికిత అనే రెండు ఆడ చింపాంజీలను విశాఖ జూకి తీసుకొచ్చారు. చికో మూడేళ్ల క్రితం మృతి చెందగా బుధవారం చీపా మృతి చెందింది. దీంతో చికిత ఒంటరిగా మిగిలింది.

నగర వ్యాప్తంగా నాకాబందీ

- తనిఖీలు చేపట్టిన 1200 పోలీసు సిబ్బంది
- 14,220 వాహనాల తనిఖీలు, ధ్రువ పత్రాలు లేని 553 వాహనాలు సీజ్
- 14.47 కేజీల బంగారం, 13.31 కేజీల వెండి, రూ.8.79 లక్షలు స్వాధీనం
- 21.22 లీటర్ల మద్యం, 10 కిలోల గంజాయి, 860 కేజీల పీడీఎస్ బియ్యం పట్టివేత


వాహన రికార్డులను పరిశీలిస్తున్న జాయింట్ సీపీ కె.ఫకీరప్ప

విశాఖ సిటీ: సాధారణ ఎన్నికల దృష్ట్యా పోలీసులు చేపట్టిన తనిఖీల్లో భారీగా బంగారం, వెండి, నగదు పట్టుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు జాయింట్ సీపీ కె.ఫకీరప్ప ఆధ్వర్యంలో నగరమంతా నాకాబందీ నిర్వహించారు. మంగళవారం రాత్రి 10 నుంచి తెల్లవారుజాము 5 గంటల వరకు 1200 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది 110 బృందాలుగా విడిపోయారు. నగరంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా, ప్రశాంత వాతారణంలో ఎన్నికలు జరిగేలా నగరమంతా జల్లెడ పట్టారు. అక్రమ మద్యం, నగదు, ఇతర అసాంఘిక, అనుమానిత వస్తువులను పూర్తిగా నివారించేలా ప్రతి వాహనాన్ని ఆపి తనిఖీలు చేశారు. ధ్రువపత్రాలను పరిశీలించారు. నగదు, బంగారం, వెండి, అక్రమ మద్యం, బియ్యం వంటి వాటిని సీజ్ చేసి విచారణ చేపట్టారు. నగరంలో మొత్తం 14,220 వాహనాలు తనిఖీ చేయగా సరైన ధ్రువపత్రాలు లేని 663 వాహనాలను సీజ్ చేశారు.

- పినగాడి జంక్షన్‌లో బైక్‌పై 10 కేజీల గంజాయిని తరలిస్తున్నట్లు వ్యక్తిని అరెస్టు చేశారు. ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు.
- శనివాడ జంక్షన్ వద్ద 14.47 కేజీల బంగారం, 13.31 కేజీల వెండి స్వాధీనం చేసుకున్నారు. దీనిపై విచారిస్తున్నారు.
- రైల్వేస్టేషన్ సమీపంలో రూ.4.5 లక్షల నగదు, ఆరు మద్యం సీసాలు, మద్దిలపాలెం జంక్షన్ వద్ద రూ.4.29 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.
- గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటోలో పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. అతడిని అరెస్టు చేసి సుమారు 860 కేజీల(18 బస్తాలు) బియ్యం, ఆటోను సీజ్ చేశారు.
- స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఒక వ్యక్తి వద్ద 12 కేజీల గంజాయిని గుర్తించారు. అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.
- పలు ప్రాంతాల్లో అక్రమ మద్యం కలిగిన 8 మందిపై నమోదు చేసి 21.22 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు.
- సరైన ధ్రువపత్రాలు లేకుండా రూ.5.97 లక్షలు తరలిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.
- ఈ తనిఖీల్లో సీజ్ చేసిన వాటిపై విచారణ జరిపి తదనుగుణంగా పోలీసులు చర్యలు తీసుకోనున్నారు.

ధ్రువపత్రాలు తప్పనిసరి

రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా పెద్ద మొత్తంలో నగదు, బంగారం లేదా ఇతర విలువైన వస్తువులను తీసుకువెళితే వాటితో పాటు తగిన ధ్రువపత్రాలు ఉంచుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో నగరంలో ఎటువంటి చట్ట విరుద్ధ రవాణాలు జరగకుండా కట్టడి చేసేందుకు తనిఖీ చేస్తున్న పోలీసులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

14.47 కిలోల బంగారం, 13.31కిలోల వెండి స్వాధీనం

కూర్మన్నపాలెం : కాకినాడ నుంచి కారులో తరలిస్తున్న 14.47 కిలోల బంగారం, 13.31 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నట్లు జోన్–2 డీసీపీ ఎం.సత్యనారాయణ తెలిపారు. బుధవారం దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ జోన్–2 పరిధిలో 55 బృందాలతో 550 మంది పోలీస్ సిబ్బందితో మంగళవారం రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు వాహన తనిఖీలను చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో అగనంపూడి దరి శనివాడ కూడలిలో పోలీసులు నాకాబందీ నిర్వహిస్తుండగా కాకినాడ నుంచి బంగారం, వెండితో వస్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, సరైన పత్రాలు చూపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఇందులో 14.47 కిలోల బంగారం, 13.31 కిలోల వెండి ఉన్నాయని, సంబంధిత పత్రాలు పరిశీలించామని, అయితే జీఎస్టీ చెల్లించారా లేదా అన్నది పరిశీలనకు జీఎస్టీ ఆఫీస్‌కు పంపించామన్నారు. జీఎస్టీ పరిశీలనలో అవకతవకలు జరిగినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. వాహనంలో ఉన్న సీక్వెల్ లాజిస్టిక్స్‌కు సంబంధించిన ముగ్గురు సిబ్బందిని, ఒక సెక్యూరిటీ గార్డును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నాకాబందీ తనీఖీల్లో భాగంగా మొత్తం 6,942 వాహనాలను తనీఖీ చేయగా, వాటిల్లో 518 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ త్రినాథ్, దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు, ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

- ప్రయోగ పరీక్షలకు 150 కేంద్రాల ఏర్పాటు
- విద్యార్థుల సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్ కేంద్రం
- ప్రాక్టికల్స్ పేరుతో డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు
- ఇంటర్మీడియట్ బోర్డ్ ప్రాంతీయ తనిఖీ అధికారి మురళీధర్


ఇంటర్ పరీక్షల నిర్వహణ వివరాలను వెల్లడిస్తున్న ఆర్‌ఐవో మురళీధర్

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ ఫైనల్ పరీక్షలకు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డ్ ప్రాంతీయ తనిఖీ అధికారి(ఆర్‌ఐవో) పి.మురళీధర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి పరీక్షల వివరాలను వారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ నెల 11 నుంచి 20 వరకు ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 1 నుంచి 15 వరకు ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఫస్టియర్ థియరీ పరీక్షలకు 40,873 మంది, సెకండియర్ పరీక్షలకు 41,806 మంది విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు. ప్రాక్టికల్స్‌కు ఎంపీసీ కోర్సు విద్యార్థులు 32,982 మంది, బైపీసీ కోర్సు విద్యార్థులు 4,945 మంది హాజరుకానున్నారన్నారు. థియరీ పరీక్షలకు జిల్లాలో 93 పరీక్షా కేంద్రాలు, ప్రాక్టికల్స్‌కు 150 కేంద్రాలను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు ఆయా రోజుల్లో ఉదయం, మధ్యాహ్నం జరుగుతాయన్నారు. థియరీ పరీక్షలు ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని, విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు

విద్యార్థుల సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆర్‌ఐవో మురళీధర్ చెప్పారు. ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే 0891–2567561 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్‌చేసి నివృత్తి చేసుకోవచ్చన్నారు. ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా హాల్‌టికెట్ మంజూరు చేయాలన్నారు. ప్రాక్టికల్స్ కోసం ప్రత్యేక రుసుం వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందుకోసం 0891–2567561 హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. సమావేశంలో డీఈవో ఎల్.చంద్రకళ, డీవీఈవో రాధ, ఆర్‌ఐవో కార్యాలయ సూపరింటెండెంట్ గణేష్, డీఎంహెచ్‌వో, ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్ ఆర్టీసీ, పోస్టల్, పోలీస్, విద్యా శాఖ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరింత వేగవంతంగా గృహ నిర్మాణాలు

- అధికారులు, కాంట్రాక్టర్లకు కలెక్టర్ ఆదేశం

మహారాణిపేట: జిల్లాలోని జగనన్న కాలనీల్లో చేపడుతున్న గృహ నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో బుధవారం గృహ నిర్మాణాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టర్లు, అధికారులు సమన్వయంతో పనిచేసి గృహ నిర్మాణ లక్ష్యాలను సాధించాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత నెల 17 నుంచి మెగా డ్రైవ్ ద్వారా గృహ నిర్మాణాల వేగం పెంచాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. పనుల్లో పురోగతి కనిపించకపోడంపై అసహనం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు కోరిన గడువుతోపాటు ఎప్పటికప్పుడు బిల్లుల చెల్లింపులు, ఇసుక, సిమెంట్, విద్యుత్ తదితరాలను సమకూర్చామని, రానున్న మూడు రోజుల్లో ప్రగతి కనిపించకపోతే సంబంధిత ఏజెన్సీని రద్దు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. మూడు రోజుల్లో ఒక్కో ఇంజినీర్ వద్ద 50 కంటే తక్కువ గృహాలు పెండింగ్‌లో ఉండాలని, అంతకుమించి ఉంటే చర్యలు తప్పవన్నారు. సాంకేతిక లోపం కారణంగా జియోట్యాగింగ్ కాని గృహాలకు తక్షణమే చేయించాలన్నారు. ఇందుకు వలంటీర్ల ద్వారా సమాచారాన్ని అందించి, లబ్ధిదారులకు అవసరమైన రవాణా సదుపాయాలను కల్పించాలన్నారు. లబ్ధిదారుల గృహాల వద్ద నుంచి జియోట్యాగింగ్ చేయాలని, గురువారం నాటికి ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని సంబంధిత జోనల్ కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై జెడ్సీలు దృష్టి సారించాలని, వచ్చిన వాటిని వెనువెంటనే పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

విద్యార్థులు సంయమనం పాటించాలి


సంఘటన వివరాలు తెలుసుకుంటున్న గొండు సీతారామ్

కొమ్మాది: నవోదయ విద్యార్థులు సంయమనం పాటించాలని, అందరూ అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. కొమ్మాది జవహర్ నవోదయ విద్యాలయలో సోమవారం జరిగిన ఘటనపై ఆయన స్పందించారు. నవోదయకు బుధవారం చేరుకుని ప్రిన్సిపాల్ సంజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. గొడవకు గల కారణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ కుటుంబ సభ్యులుగా మెలగి మంచి వాతావరణం సృష్టించాలని సూచించారు. గొడవలు పడి కేసులు నమోదైతే జీవితం ఛిద్రమవుతుందని హెచ్చరించారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. చట్టాలపై పిల్లలకు అవగాహన కలిగించాలని సూచించారు. యాజమాన్యం పొరపాటు ఉంటే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటనపై నవోదయ, జిల్లా విద్యాశాఖ, పోలీసులు నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట జిల్లా ఉప విద్యాశాఖ అధికారి గౌరీశంకర్, చినగదిలి ఎంఈవో రవీంద్రబాబు, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఖలీషా బేగం, భీమిలి చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీదేవి పాల్గొన్నారు.

బాలుడి అసభ్యకర చేష్టలపై ఫిర్యాదు

ఎంవీపీకాలనీ: శివాజీపాలెంలో ఓ బాలికతో అదే ప్రాంతానికి చెందిన బాలుడు అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. బుధవారం రాత్రి తమ కూతురి(7)తో బాలుడు అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ శివాజీపాలేనికి చెందిన తల్లిదండ్రులు ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పక్క పక్క ఇల్లు కావడంతో గత మూడు రోజులుగా బాలుడు(13) బాలికకు మాయమాటలు చెప్పి ఇంటికి తీసుకెళ్లి అసభ్యకర చేష్టలకు పాల్పడినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై పోక్సో చట్టం కింద ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై సీఐ సంజీవరావును పలుమార్లు ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

జగనన్న ఆరోగ్య సురక్షలో 4,557 మందికి సేవలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా బుధవారం శ్రీకాంత్‌నగర్, నరసింహనగర్, న్యూగాజువాక, నక్కవానిపాలెం, పెదగంట్యాడ, శివనగర్, రంగిరీజు వీధి, లాసన్స్‌బే కాలనీ, దండుబజార్, మధురవాడ, దండుబజార్–2 తదితర ప్రాంతాల్లో వైద్య శిబిరాలు జరిగాయి. ఈ శిబిరాల్లో మొత్తం 4,557 మందికి వైద్య సేవలందించారు. వీరిలో 15 మందిని ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రులకు, నలుగురిని కంటి చికిత్స కోసం ప్రాంతీయ కంటి ఆస్పత్రికి రిఫర్ చేశామని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. పిఠాపురంకాలనీ, తోటగరువు, రేసవానిపాలెం(స్వర్ణభారతి), రంగిరీజువీధి, కొబ్బరితోట–1, రైల్వే న్యూకాలనీ, ఏఎస్‌ఆర్‌నగర్, పెదగంట్యాడ, న్యూ గాజువాక, చంద్రానగర్–1 తదితర ప్రాంతాల్లో గురువారం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు –పాడేరు జాతీయ రహదారిలో జైపూర్ జంక్షన్ సమీపంలో రెండు కిలోల గంజాయిని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఇక్కడ వాహనాలు తనిఖీ చేస్తుండగా, స్కూటీపై గంజాయి తరలిస్తున్న విశాఖపట్నానికి చెందిన రేగ రోహిత్, కొల్లా సునీల్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి స్కూటీతోపాటు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నారాయణ కళాశాల వద్ద మృతుని బంధువుల ఆందోళన

- గత నెల 26న కాలేజీ హాస్టల్‌లో విద్యార్థి నిఖిల్ ఆత్మహత్య
- మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు
- సమగ్ర దర్యాప్తునకు డిమాండ్


నారాయణ కళాశాల గేటు వద్ద ఆందోళన చేస్తున్న నిఖిల్ తల్లిదండ్రులు

పీఎం పాలెం : నారాయణ రెసిడెన్షియల్ కళాశాలలో గత నెల 26న మరణించిన నెల్లూరు నిఖిల్ వినాయక్ మృతి విషయంలో కళాశాల యాజమాన్యం తప్పుడు సమాచారం ఇచ్చిందని ఆరోపిస్తూ విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు బుధవారం కళాశాల వద్ద ధర్నాకు దిగారు. మరణించిన విద్యార్థి తల్లి శారద నిఖిల్ ఫొటోతో గేటు ఎదుట బైఠాయించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా బుసవారిబండ గ్రామం ఇలిసుపురం ప్రాంతానికి చెందిన నెల్లూరు రవికుమార్ కుమారుడు నిఖిల్ వినాయక్ (16) 6వ తరగతి నుంచి నారాయణ క్యాంపస్‌లలో 9వ తరగతి వరకూ చదివాడు. పీఎం పాలెంలోని నారాయణ ఓసీలో 10వ తరగతి చదివాడు. గత ఏడాది ఆగస్టులో విద్యార్థులతో జరిగిన ఘర్షణలో గాయాలు కావడంతో అప్పట్లో విద్యార్థి తండ్రి శ్రీకాకుళం తీసుకుపోయాడు. మరలా జనవరి 21న తీసుకొచ్చి నారాయణ రెసిడెన్షియల్ కళాశాలలో చేర్పించాడు. 24న హాస్టల్ వార్డెన్ నిఖిల్ ఆరోగ్యం బాగాలేదని తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. ఈ క్రమంలో 25న తండ్రితో ఫోన్‌లో నిఖిల్ మాట్లాడాడు. ఆ మరుసటి రోజు 26న ఉదయం 11 గంటలకు ఆత్మహత్య చేసుకున్నాడని తల్లిదండ్రులకు వార్డెన్ సమాచారం అందించాడు. అప్పట్లో మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే తమ కుమారుని మృతి విషయంలో హాస్టల్ యాజమాన్యం కట్టు కథ అల్లిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. నిఖిల్ ఉరి వేసుకున్న ఫ్యాన్‌కు కనీస డ్యామేజీ కాలేదని, సమీపంలోని ఆస్పత్రికి కాకుండా సుదూరంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారని, సమాచారం చేరవేయడంలో జాప్యం చేశారని, నిఖిల్ మూతి భాగంలో రక్తం కారిన చారలున్నాయని, తెలుగు సరిగ్గా రాయడం రాని నిఖిల్ సూసైడ్ నోట్ ఎలా రాశాడని, నకిలీ లేఖ సృష్టించారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తోటి విద్యార్థులే తీవ్రంగా కొట్టి గాయపరిస్తే... కాలు జారి పడిపోయినట్టు సమాచారం అందించారని ఆరోపించారు. పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ రామకృష్ణ విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులతో మాట్లాడి సముదాయించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి బాధ్యులను చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు.

వెలమలను గుర్తించిన పార్టీలకే మా మద్దతు

- వెలమ సంక్షేమ సంఘం సెంట్రల్ అధ్యక్షుడు చుక్క చినబాబు


మాట్లాడుతున్న చుక్క చినబాబు

దాబాగార్డెన్స్: వెలమలను గుర్తించిన రాజకీయ పార్టీకే మా మద్దతు ఉంటుందని వెలమ సంక్షేమ సంఘం సెంట్రల్ అధ్యక్షుడు చుక్కా చినబాబు స్పష్టం చేశారు. ఒక్క ఉత్తరాంధ్ర జిల్లాలోనే 25 లక్షల పైబడి వెలమ సామాజికవర్గ ప్రజలు ఉన్నారని చెప్పారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని పార్టీలు వెలమ జాతికి ప్రాధాన్యమివ్వాలన్నారు. విశాఖపట్నం/అనకాపల్లి పార్లమెంట్ స్థానం, ఉమ్మడి విశాఖ జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాలు తమకు కేటాయించాలన్నారు. ఉత్తరాంధ్రలో 14 అసెంబ్లీ, 3 ఎంపీలు సీట్లు కేటాయించాలని కోరారు. ఈ మేరకు ఆయా పార్టీల అధినేతలకు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. వెలమ సంఘం నాయకులు పాశల సూర్యనారాయణ, చలుమూరు నాయుడుబాబు, బొడ్డు నరసింహపాత్రుడు, కూండ్రపు సోమేశ్వరరావు, బండారు రామకృష్ణ, మిడతాన బాపునాయుడు తదితరులతో కలసి రాజకీయ పార్టీల ప్రతినిధులను కలుస్తామని వివరించారు.

రూరల్ తహసీల్దారు కార్యాలయంలో రక్షణ చర్యలు


రూరల్ మండలం కార్యాలయంలో కలెక్టర్ మల్లికార్జున, అధికారులు

ఆరిలోవ : రూరల్ తహసీల్దారు కార్యాలయంలో రక్షణ చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. రూరల్ తహసీల్దారు కార్యాలయాన్ని బుధవారం ఆయన జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఆర్డీవో భాస్కరరెడ్డితో కలిసి సందర్శించారు. ఇక్కడ అధికారులు, మండల పరిధిలో సచివాలయాల వీఆర్వోలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. విధులు సక్రమంగా నిర్వహించాలని, ఆఫీస్‌కు సంబంధించిన వ్యవహారాలు ఇళ్ల వద్ద చేయవద్దని సూచించారు. ఆఫీస్‌లోనే విధులకు సంబంధించిన పనులు చేసుకోవాలని తెలిపారు. నిజాయితీగా విధులు నిర్వహించాలని, ఏ పనులు కోసమైనా రాజకీయ నాయకులు ఒత్తిడి చేసినా తల వంచకూడదని తెలిపారు. అనంతరం మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ తహసీల్దారు రమణయ్య సంఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్‌లో జరగకుండా తగిన జాగ్రత చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు భద్రత కల్పించే విధంగా రక్షణ చర్యలు చేపడుతున్నామన్నారు. రూ.5 లక్షలతో ఇక్కడ కార్యాలయం భవనం మరమ్మతులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రక్షణ చర్యల్లో భాగంగా ప్రత్యేకంగా ఈ భవనం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో పాటు ఇక్కడ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం కోసం ఇప్పటికే నగర పోలీస్ కమిషనర్‌కు లేఖ రాశామన్నారు. భూములకు సంబంధించిన వ్యక్తులు, వారి రక్త సంబంధీకులు మాత్రమే తహసీల్దారు కార్యాలయానికి రావాలని, మధ్యవర్తులు రాకుండా తహసీల్దారు సిబ్బంది జాగ్రతపడాలని సూచించారు. దీనికి సంబంధించిన నిబంధనలతో కూడిన బోర్డు కూడా కార్యాలయం ముందు ఏర్పాటు చేస్తామన్నారు.